ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది:22.04.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, వివిధ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఈ తెల్లవారు జాము నుంచి సమ్మెకు దిగారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.
2. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని రాష్ట్ర హైకోర్టు ఈరోజు ఆదేశించింది.
3. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్ రావు ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు కన్నుమూశారు.
4. ఆదిలాబాద్ జిల్లా గోండు గూడెంలో 'ఆదివాసీ టూరిజం ఎక్స్ పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఉదయం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

---------------------------

**ఆర్టీసీ సమ్మె**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో ఈరోజు తెల్లవారు జామునుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లోనే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నా .

**పీటీసీ – హైదరాబాద్**

-------------------------------

**పొన్నం**

ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ పరిరక్షణ, ప్రజాశ్రేయస్సు కోసం సమ్మె విరమించాలని కోరారు. సమస్యకు సమ్మె పరిష్కారం కాదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి కమిటీ వేసినట్లు తెలిపారు. నాలుగు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు.
మరోవైపు.. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్మికులు సమ్మెను విరమించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

**బైట్ – పొన్నం ప్రభాకర్**

**పీటీసీ – హైదరాబాద్**

----------------------------

**హైకోర్టు కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. దీంతో, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీష్ రావుకు ఊరట లభించింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ కేసీఆర్, టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె.జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. ఈరోజు తీర్పును వెలువరించింది.

**పీటీసీ – హైదరాబాద్**

-----------------------------

**నాదేండ్ల భాస్కర్ రావు కన్నుమూత**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1935లో గుంటూరులో జన్మించిన ఆయన, 1978లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 1984లో నెలరోజుల పాటు ముఖ్యమంత్రిగా

సేవలు అందించారు. శాసన సభ్యుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా  పని చేసిన నాదేండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదేండ్ల మనోహర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేస్తున్నారు.

ఆయన మరణం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

**పీటీసీ – హైదరాబాద్**

--------------------------------

**ఆదివాసీ టూరిజం ఎక్స్ పోజర్**

రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు  'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో ఈ ఉదయం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్ పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. 8 బస్సుల్లో 250 మంది ఆదివాసీలు హైదరాబాద్ కు  బయలుదేరారు.

**పీటీసీ - నిర్మల్**

--------------------------------

**తుమ్మల**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 కిలో మీటర్ల పొడవున జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరిశీలించారు. ఈ పర్యటనలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ - భద్రాద్రి**

--------------------------------

**బస్సులు - జిల్లాలు**

రాష్ట్రంలో ఆర్టీసీ సిబ్బంది సమ్మె కారణంగా ప్రయాణీకులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల బస్సు డిపోలో 40 అద్దె బస్సులను నడిపించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆసిఫాబాద్ డిపో పరిధిలో తాత్కాలికంగా పనిచేయడానికి ఆసక్తి గల డ్రైవర్లు, కండక్టర్ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ దేవపాల తెలిపారు. ఈరోజు సాయంత్రం వరకు డిపోలో దరఖాస్తుల సమర్పించాలన్నారు.

**పీటీసీ - మంచిర్యాల, ఆసిఫాబాద్**

--------------------------------

**ఆర్టీసీ అసోసియేషన్**

ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన ఐ.ఎ.ఎస్.ల కమిటీని స్వాగతిస్తున్నట్లు సూపర్ వైజర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు తెలిపారు. సూపర్ వైజర్ అసోసియేషన్ సమ్మెలో పాల్గొనడం లేదని అన్నారు. ఆర్టీసీ ఎండీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**డెస్క్**

------------------------------

**కిషన్ రెడ్డి**

తెలంగాలోని వివిధ రైల్వేస్టేషన్ల నుంచి ఎనిమిది కొత్త రైళ్లను రైల్వేశాఖ ప్రకటించింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో అందుబాటులోకి వస్తున్న ఈ రైళ్లు హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి రైల్వే స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు వీక్లీ ట్రైన్స్ గా ప్రయాణీకులకు సేవలు అందించనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

**డెస్క్**

---------------------------

**సీతక్క**

మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈరోజు మేఘాలయకు పర్యటనకు వెళ్తున్నారు. స్టేట్-టు-స్టేట్ భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు మంత్రి అక్కడి కార్యక్రమాలను పరిశీలిస్తారు. ఈ పర్యటనలో మహిళా శిశు అభివృద్ధి రంగంలో మేఘాలయ రాష్ట్రం అమలు చేస్తున్న పలు కీలక కార్యక్రమాలను మంత్రి అధ్యయనం చేయనున్నారు.

**డెస్క్**

--------------------------------

**ధరిత్రీ దినోత్సవం**

ఈరోజు ధరిత్రీ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 22వ తేదీ ప్రపంచ భూమి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. "మన శక్తి, మన గ్రహం" అనేది ఈ ఏడాది ఇతివృత్తంగా ఉంది.

**జీఎస్**

------------------------------------------

**భూమి దినోత్సవం**

ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసారం పెంపుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా చందుర్తి మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు ఆకాశవాణితో మాట్లాడుతూ...

**బైట్ - దుర్గరాజు, వ్యవసాయ అధికారి**

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------

**ఆయిల్ పామ్**

రైతులు ఆయిల్ పామ్ తో పాటు అంతర పంటలుగా పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు పండిస్తే ఆర్థికంగా ఎదగవచ్చని మహబూబాబాద్ జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ

అధికారి జినుగు మరియన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ....

**బైట్ - మరియన్న**

**పీటీసీ – మహబూబాబాద్**

-------------------------

**పహల్గాం రేవంత్**

పహల్గామ్ లాంటి దారుణమైన ఉగ్రవాద దాడులు దేశ ఐక్యతను దెబ్బతీయలేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా, ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరులను స్మరించుకున్నారు.

**డెస్క్**

---------------------------------

**హెచ్ఆర్సీ**

వీధి కుక్కల దాడుల వల్ల కలుగుతున్న మరణాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలపై స్పందించిన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఈ ఘటనలను సుమోటోగా విచారణకు స్వీకరించారు. వీధి కుక్కల దాడిలో పెద్దపల్లి జిల్లాలో దివ్య బెహరా అనే మూడేళ్ల చిన్నారి, అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో ర్యాకం నాగరాజు మరణించడం బాధాకరమన్నారు.

**డెస్క్**

-------------------------------

**అడ్లూరి**

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగస్తులదే కీలక పాత్ర అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ సూచించిన విధంగా కేవలం చదువు ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని చెప్పారు. సచివాలయంలో నిన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

**డెస్క్**

---------------------------------

**సజ్జనార్**

దేశంలో సైబర్ నేరగాళ్లను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం అత్యవసరమని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు.

**డెస్క్**

-----------------------------------